క్లుప్తంగా

విద్యార్థులకు బూట్లు వితరణ



వేల్పూర్: మోతె హైస్కూలు విద్యార్థులకు స్థానిక పూర్వ విద్యార్థి, కామారెడ్డి ఎస్‌బీఐ బ్రాంచి మేనేజరుగా ఉన్న ఇస్సాపల్లి రవి 235 బూట్ల జతలు బుధవారం వితరణ చేశారు. గ్రామానికి చెందిన జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ దొల్ల రాజేశ్వర్‌రెడ్డి, రవి మిత్రులు విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వైద్య గణేష్, ఉపాధ్యాయులు రత్నయ్య, శ్రావణశ్రీ, కవిత, తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్‌లో..

భీమ్‌గల్: పట్టణ కేంద్రంలోని ఎంపీపీఎస్ బోయిగల్లి ప్రధానోపాధ్యాయుడు సత్య రమేష్ సొంత ఖర్చులతో బుధవారం విద్యార్థులకు టై, బెల్టులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో స్వామి మాట్లాడుతూ.. విద్యార్థులకు మంచి చేయాలనే ఆలోచన ఉన్న హెచ్‌ఎంను అభినందించారు. ఉపాధ్యాయులు లింబాద్రి, మహేష్, అశోక్ పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో అరటి పండ్లు..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో తిథి భోజన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అరటిపండ్లు, మిఠాయిలు అందజేశారు. మధ్యాహ్నం భోజన సమయంలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన 'తిథి భోజన్' కార్యక్రమంలో భాగంగా రోటరీ సభ్యులు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేసి నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యదర్శి రాస ఆనంద్, పాఠశాల హెచ్‌ఎం పుప్పాల లక్ష్మీనర్సయ్య, రోటరీ సభ్యులున్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారం..

బోధన్‌టౌన్(బోధన్): లయన్స్ క్లబ్ ఆఫ్ రాయల్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆటోనగర్ కాలనీలోని నిరుపేదలకు అల్పాహారం వితరణ చేశారు. దాతగా లయన్స్ క్లబ్ ఆఫ్ రాయల్ ప్రతినిధి లయన్ జ్యోతిరాజ్ వ్యవహరించారు. క్లబ్ ప్రతినిధులు రమేష్ పవార్, రవీందర్, జమీల్ పటేల్, వాసు, శ్రీనివాస్ ఉన్నారు.

ఇక ప్లాస్టిక్ వాడితే జరిమానాయే!

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని వ్యాపారస్తులు ప్లాస్టిక్ విక్రయిస్తే జరిమానా తప్పదని సానిటరీ ఎస్సై గజానంద్ అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో కాలుష్య నియంత్రణ మండలి సూచనల మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణంలో తనిఖీలు నిర్వహించారు. ప్లాస్టిక్‌ను సీజ్ చేసి రూ.12,500 జరిమానా విధించారు. ప్లాస్టిక్ బదులు గోనె సంచులు వాడాలని సూచించారు. పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

కౌమార దశపై అవగాహన

వేల్పూర్: వేల్పూర్ మండల విద్యావనరుల కేంద్రంలో బుధవారం జరిగిన కాంప్లెక్స్ సమావేశంలో వర్డ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు విద్యార్థుల కౌమార దశపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కౌమారదశలో వచ్చే మార్పులపై విద్యార్థులకు తెలపాలని కోరారు. సంస్థ కమ్యూనిటీ కో–ఆర్డినేటర్ లావణ్య, ఎస్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని లోటస్ పాఠశాలలో బుధవారం దత్తసాయి డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలోఉచిత డెంటల్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు నవీన్, నిఖితలు విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. దంతాల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం బ్రెష్, పేస్టులను ఉచితంగా అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ అంబిక పవార్, ప్రిన్సిపాల్ పల్లవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

వర్ని: పది రోజులుగా కురుస్తున్న వర్షానికి పోతంగల్ మండలంలోని జలపల్లి గ్రామంలో ఇల్లు కూలిపోయిన ఇద్దరు బాధితులకు సామాజిక కార్యకర్త హకీం రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ప్రభుత్వం ద్వారా కూలిన ఇళ్లకు రూ.3 వేల ఆర్థిక సహాయం అందజేయడం బాధాకరమని, ఇల్లు కోల్పోయిన వారికి పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

భీమ్‌గల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం నందు దూర విద్య డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హెచ్ సతీశ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న ఉన్న కళాశాలలో, మరిన్ని వివరాలకు 9848581970, 738292980 నంబర్లను సంప్రదించాలని కోరారు.

అధ్వానంగా పాఠశాల ప్రాంగణం

- పొంగిపొర్లుతున్న మురికి నీటి సంపు
- గురుకులాన్ని పట్టించుకోని అధికారులు



పాఠశాల ప్రాంగణంలో నిండిన మురికి నీటి సంపు



పాఠశాల మైదానంలో పారుతున్న డ్రెయినేజీ నీరు

మాక్లూర్/సుభాష్‌నగర్: మండలంలోని దాస్‌నగర్ వద్ద ఉన్న మహాత్మా జ్యోతీబాపూలే పాఠశాల ప్రాంగణంలోనికి డ్రెయినేజీ నీరు వస్తోంది. మురికి నీటి సంపు కూడా సమీపంలోనే ఉండటంతో ఆ నీరు పాఠశాల గేటు వరకు వస్తోంది. ఫలితంగా పాఠశాల మొత్తం దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో విద్యార్థులు దుర్వాసన తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల హాస్టల్ వసతితో ఇంటర్మీడియట్ వరకు ఉంది. మొత్తం 818 మంది విద్యార్థులు అక్కడే హాస్టల్‌లో ఉండి విద్యనభ్యసిస్తున్నారు. హాస్టల్‌లో వాడిన మురికి నీరు మొత్తం పాఠశాల ప్రాంగణంలోనే ఏర్పాటు చేసిన సంపులోనికి చేరుతుంది.సమీపంలో ఉన్న మరో బీసీ సంక్షేమ బాలికల డిగ్రీ కళాశాల మురికి నీరు కూడ ఇదే సంపులోనికి చేరుతుంది. దీంతో మురికి నీరు ఓవర్‌ఫ్లో అయి పాఠశాల ఆవరణలోకి వస్తోంది. అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని సామాజిక కార్యకర్త సుధీర్‌సింగ్ ఉన్నత అధికారులను కోరుతున్నారు.

సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

సమస్యను ఉన్నత అధికారి దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో పరిష్కారం అవుతుంది. మురికి నీరు తమ పరిధిలోనికి రావద్దని సమీప వెంచర్ల యజమానులు చెప్పారు. అప్పటి నుంచి ఆ నీరు నిల్వకై ప్రత్యేక సంపు నిర్మించాం. ప్రస్తుతం మురికి నీరుపై దోమలు, ఈగలు వాలకుండా ప్రతి రోజు ఆయిల్ బాల్స్ వేయిస్తున్నాను. – స్వప్న, ప్రిన్సిపాల్ మహాత్మా జ్యోతీబాపూలే పాఠశాల, దాస్‌నగర్

పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడికి వీడ్కోలు



సాయాగౌడ్‌కు వీడ్కోలు పలుకుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



ఎంపీవోను సన్మానిస్తున్న డీపీవో తరుణ్

బోధన్: బోధన్ పట్టణంలోని రాకాసీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల(జేసీ)లో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు సాయాగౌడ్ బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పాఠశాల ప్రాంగణంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుల గది నుంచి పాఠశాల ప్రవేశ ద్వారం వరకు ఆ ఉపాధ్యాయుడికి తోడుగా నడిచి చప్పట్లు కొడుతూ ఘనంగా వీడ్కోలు పలికారు. హెచ్‌ఎం బాలచంద్రం, ఉపాధ్యాయులున్నారు.

పదవీ విరమణ తప్పనిసరి

వర్ని: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని, పదవీకాలంలో పని చేసినదే ముఖ్యమని జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ అన్నారు. బుధవారం రుద్రూర్ ఎంపీఓ సాయిలు పదవీ విరమణ కార్యక్రమానికి డీపీవో ముఖ్యఅతిథిగా హాజరై సాయిలును సన్మానించారు. డీఎల్‌పీవో మధుకర్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో సురేష్ బాబు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

పెర్కిట్(ఆర్మూర్): ప్రజలు సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ గజానన్ సూచించారు. ఆర్మూర్ మండలం మంథనిలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం తహసీల్దార్ గ్రామ వైద్య, ఆరోగ్య సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ప్రభుత్వం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి మధ్యాహ్న భోజనం నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం చూడాలని హెచ్‌ఎం శ్యామలాబాయికి సూచించారు.

రైళ్లు పునఃప్రారంభించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఎంటీబీఎఫ్ ప్రతినిధులు

వేల్పూర్: ముంబై నుంచి కరీంనగర్‌కు నడిచే ఎక్స్‌ప్రెస్ రైలును, నిజామాబాద్, కరీంనగర్ మధ్య ఎక్స్‌ప్రెస్ రైలును పునఃప్రారంభించాలని ముంబై తెలంగాణ బహుజన ఫోరం(ఎంటీబీఎఫ్) ప్రతినిధులు మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు బుధవారం ఢిల్లీలో వినతిపత్రం అందజేశారు.వారు మాట్లాడుతూ..అజంతా ఎక్స్‌ప్రెస్‌ను ముంబాయి వరకు పొడిగించాలని, పన్వె ల్, రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్‌లను కరీంనగర్ వరకు పొడిగిస్తూ నిజామాబాద్, ఆర్మూర్, మోర్తాడ్, మెట్‌పల్లి, కోరుట్ల, లింగంపేట్, జగిత్యాల్, గంగాధర వద్ద హాల్ట్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. అంతేగాక ఆదిలాబాద్ ఆనంద్వాన్ ఎక్స్‌ప్రెస్‌ను ముంబాయి వరకు పొడిగించాలని కోరారు. రైల్వే మంత్రికి విన్నవించి సమస్య పరిష్కరించేటట్లు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చినట్లు వారు వెల్లడించారు.

ఆధ్యాత్మికం

■ క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో బోనాలు



పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లిలో బుధవారం క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్షత్రియ సమాజ్ మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి పోచమ్మ, ముత్యాలమ్మ, ఎల్లమ్మ దేవతలకు నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి సామూహిక భోజనాలు చేశారు.

లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో..

భీమ్‌గల్: ఆషాడమాస బోనాలను పురస్కరించుకొని మండలంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ లో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఊరేగింపుగా బస్టాండ్ మీదుగా వెళ్లి ఊరి చివరన గల పోచమ్మ గుడిలో బోనాలు సమర్పించారు. స్కూల్ ప్రిన్సిపాల్ షఫి, మేనేజింగ్ డైరెక్టర్ సనా, తదితరులు పాల్గొన్నారు.

■ దేవుని సేవ ఎంతో తృప్తినిచ్చింది

బాల్కొండ: భగవంతుని సేవ ఎంతో తృప్తినిచ్చిందని మెండోరా మండలం పోచంపాడ్‌లోని రామలింగేశ్వర ఆలయ ప్రధాన అర్చకుడిగా పదవీ విరమణ పొందిన బైరప్ప కృష్ణమూర్తి అన్నారు. బుధవారం ఆలయంలో పదవి విరమణ సన్మానం పొందారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వేణు, అర్చక సంఘం అధ్యక్షుడు రాములు పాల్గొన్నారు.

■ జెండా బాలాజీ జాతర జెండా పూజ

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జెండాగల్లీలోని వేంకటేశ్వర ఆలయ ఆవరణలో ప్రజా ఐక్య సర్వసమాజ్ సమితి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో జెండా బాలాజీ జాతర నిర్వహిస్తారు. అందులో భాగంగా సర్వసమాజ్ అధ్యక్షుడు ఆకుల రాజు దంపతులు, హజారి మదన్‌మోహన్ కుటుంబ సభ్యుల సమక్షంలో జెండా బట్టకు ఆలయంలో వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 7 నుంచి జెండా జాతర ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు.15న జెండా జాతర ఉంటుందన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి

బాల్కొండ: ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని ప్రీ యూనిక్ కంపెనీ ప్రతినిధి రాజేందర్ అన్నారు. బుధవారం మెండోరా మండల కేంద్రంలో ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటను సాగు చేసే రైతులకు ఎరువుల కోసం ప్రభుత్వం ఎకరానికి రూ.4,200 ఇస్తుందన్నారు. వచ్చే ఏడాది నిర్మల్ జిల్లా పాక్‌పట్ల గ్రామం వద్ద ఫ్యాక్టరీ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.

ఏజెన్సీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

వర్ని: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కోటగిరి తహసీల్ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు ధర్నా నిర్వహించారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. ప్రభుత్వం ఏజెన్సీ కార్మికులకు నెలనెలా బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులు తెచ్చి విద్యార్థులకు భోజనం పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఏఐటీయూసీ జిల్లా నాయకులు దుబాస్ రాములు వాపోయారు.

తల్లిపాల ప్రాముఖ్యతను ప్రతి తల్లికి తెలియజేయాలి

ఎడపల్లి(బోధన్): నేటి నుంచి వారం రోజులపాటు నిర్వహించే తల్లి పాల వారోత్సవాల గురించి గ్రామాలలో విరివిగా ప్రచారం చేయాలని ఐసీడీఎస్ బోధన్ ప్రాజెక్టు సీడీపీవో జానకి అంగన్‌వాడి టీచర్లను ఆదేశించారు. బుధవారం జానకంపేట్‌లో ఐసీడీఎస్ క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ఐసీడీఎస్ రూపొందించిన వివిధ అంశాలపై తల్లులకు అవగాహన కల్పించాలని కోరారు. అంగన్వాడీ టీచర్లు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ విజయరాణి తదితరులున్నారు.

'వైద్యుల కొరతను అధికారుల దృష్టికి తీసుకెళ్తా'

బోధన్‌టౌన్(బోధన్): బోధన్‌లోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఉన్న వైద్యుల కొరత సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని ఆస్పత్రి సూపరింటెండెంట్ కృష్ణ ప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించిన అనంతరం మాట్లాడారు. వైద్యుల కొరత వల్ల అత్యవసర చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలిస్తున్నట్లు తెలిపారు. గైనకాలజిస్ట్ లేకపోవడం వల్ల డెలివరీల కోసం నిజామాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి, బాన్సువాడ ఆస్పత్రి తరలించారని, ఈ రోజు నూతనంగా డాక్టర్ సాల్విన జాయిన్ అయ్యారని, వీరితో పాటు మరో ఇద్దరు డాక్టర్‌లు ఉంటే మూడు షిఫ్టుల్లో డ్యూటీలు చేస్తారన్నారు.

సరిహద్దులు చూపాలి

భీమ్‌గల్: పట్టణ కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లకు సంబంధించిన స్థలం విస్తీర్ణం, సరిహద్దులు తెలియజేయాలని కోరుతూ కేసీఆర్ కాలనీ వాసులు స్థానిక తహసీల్ కార్యాలయంలో బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మా కాలనీలో ఖాళీ స్థలాన్ని అప్పటి ప్రభుత్వం కల్యాణ మండపం కోసం కేటాయించిందని, ఆ స్థలం వద్ద ప్రక్కన ఉన్న వారు భూమిని చదును చేసి ప్రహరి గోడ నిర్మిస్తున్నారని అన్నారు. సరిహద్దులు తెలియజేయాలని కోరారు.

కోర్టు కేసులున్న భూముల్ని సాగు చేయనీయొద్దు



వినతి పత్రం అందజేస్తున్న, అమీర్‌నగర్ గ్రామస్తులు

కమ్మర్‌పల్లి: కోర్టు కేసులున్న భూముల్లో సాగు చేయకుండా చర్యలు తీసుకోవాలని బుధవారం కమ్మర్‌పల్లి తహసీల్ వద్ద అమీర్‌నగర్ గ్రామస్తులు ధర్నా చేపట్టారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. అమీర్‌నగర్ పరిధి సర్వే నంబర్–73లోని భూమిలో 30 ఏళ్లగా గ్రామ శివాలయంలో ఆధ్వర్యంలో గ్రామస్తులు సాగు చేస్తున్నారని తెలిపారు. చౌట్‌పల్లికి చెందిన మారు శంకర్, కొమ్ముల వెంకన్న, కొట్టాల రాజేశ్వర్, కొట్టాల సమంత ఆ భూమిలోకి వచ్చి పంట సాగుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. పట్టాలు చూపిస్తూ తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. అక్రమంగా పొందిన పట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారమయ్యే వరకు ఆ భూమిలోకి ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టాలను రద్దు చేసే అధికారం అధికారులకు లేదని తహసీల్దార్ ఆంజనేయులు గ్రామస్తులకు సూచించారు. ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్ రాగా ఆయనకు వినతి పత్రం అందించారు.

విరాద్య విశ్వం చిత్ర టైటిల్ పోస్టర్ ఆవిష్కరణ



సాలంపాడ్ క్యాంప్‌లో విరాద్య విశ్వం చిత్ర యూనిట్ సభ్యులు



చిత్ర టైటిల్ పోస్టర్

బోధన్: సాలూర మండలంలోని సాలంపాడ్ క్యాంప్‌లో బుధవారం టీఎన్‌ఆర్ ఆర్ట్స్ ప్రొడక్షన్స్, క్రియేటివ్ డ్రీమ్ ప్రొడక్షన్స్ కలిసి నిర్మిస్తున్న 'విరాద్య విశ్వం' చిత్రం టైటిల్ పోస్టర్లను చిత్ర యూనిట్ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సినిమాకు సాలంపాడ్ క్యాంప్ గ్రామానికి చెందిన తూము నవీన్ రెడ్డి రచన, దర్శకత్వం వహిస్తున్నారు. తిరుమలేశ్, దీపా రాథోడ్‌తో పాటు కిరణ్ దాచేపల్లి, ఆకివీడు శివ తదితరులు కీలక పాత్రలో నటిస్తున్నారని, సన్నీ మెల్చిడెక్ సంగీతం అందిస్తున్నట్లు దర్శకుడు నవీన్ రెడ్డి తెలిపారు. సరికొత్త కథాంశంతో నిర్మిస్తున్న ఈ చిత్ర షూటింగ్ 90 శాతం పూర్తయిందని, త్వరలోనే ఓటీటీలో విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. నిర్మాతలుగా తూము విష్ణువర్ధన్ రెడ్డి, యడ్ల నిరంజన్‌రెడ్డి, బిజ్జం విష్ణువర్ధన్ రెడ్డి, వీరంరెడ్డి అశోక్ రెడ్డి వ్యవహరిస్తున్నారని తెలిపారు. పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులు శ్రీహర్ష, ప్రసన్న, సతీష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వాహనదారులు నిబంధనలు పాటించాలని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని తల్లిదండ్రులకు సూచించారు. త్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మైనర్ల డ్రైవింగ్ లాంటి ఘటనల్లో 22 కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు.

ఆర్మూర్‌లో వాహనాల తనిఖీ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ బస్టాండ్ ప్రాంతంలో బుధవారం పోలీస్, ట్రాఫిక్, రవాణ శాఖ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ, డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. నూతన ట్రాఫిక్ నిబంధనలు ప్రకారం జరిమానా విధిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎంవీఐ అధికారి వివేకానంద్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ రమేష్, ఎస్సై అంజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతతోనే ఆరోగ్యం

ఆర్మూర్‌టౌన్: మానసిక ప్రశాంతతతోనే మనిషి ఆరోగ్యంగా ఉంటారని న్యూరో సైకియాట్రిస్ట్ డాక్టర్ రవి కుమార్ ఇన్నమూరి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ఆందోళన సమస్యలపై విద్యార్థుల కు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానిసిక ఒత్తిడి తట్టుకొని ముందుకు ఎలా వెళ్లాలో వివరించారు. హెల్త్ సూపర్‌వైజర్ శాంత, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్, ప్రిన్సిపాల్ కనకమహాలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ గంగాధర్, తదితరులు న్నారు.

కాంప్లెక్స్ టీచర్ల సమావేశం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం పిప్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం కాంప్లెక్స్ స్థాయి టీచర్ల సమావేశం నిర్వహించారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేపై చర్చించారు. అలాగే నవంబరులో 3, 6, 9, తరగతులకు నిర్వహించే ఎన్‌ఏఎస్–24కు ప్రణాళికలను సిద్ధం చేయాలని నోడల్ అధికారి వెంకట్ నర్సయ్య సూచించారు. న్యాస్ రీసోర్స్ పర్సన్లు పోచన్న, రంజిత్, ఆర్మూర్, బాల్కొండ మండలాల టీచర్లు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలి



కమ్మర్‌పల్లి: పట్టా పాస్‌బుక్ ఉన్న ప్రతి రైతుకు రైతు రుణమాఫీ వర్తింపజేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నర్సింహారెడ్డి, బాల్కొండ నియోజకవర్గ కన్వీనర్ మల్కన్నగారి మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కమ్మర్‌పల్లి బీజేపీ కార్యాలయంలో వారు మాట్లాడారు. వృద్ధాప్య పింఛను రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు, మహిళలకు మహాలక్ష్మి పథకం కింద రూ.2,500, కల్యాణ లక్ష్మి పథకంలో రూ. 1.16 లక్షలతో పాటు తులం బంగారం ఇస్తామని ప్రకటించిందని గుర్తు చేశారు. 8 నెలల కావస్తున్నా కాలయాపన చేయడం సరికాదన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి అక్రమాలను ఎత్తిచూపుతూ బీజేపీ జెండా ఎగురవేయాలన్నారు. నేతలు సంత లింగారెడ్డి, చింత ప్రవీణ్, తదితరులున్నారు.

శిఖం భూమి కబ్జాపై ఫిర్యాదు



ఎడపల్లి: మండలంలోని బ్రాహ్మణపల్లిలో పెద్ద చెరువు శిఖం భూమి కొన్ని చోట్ల కబ్జాకు గురైందని గ్రామ గంగపుత్ర సంఘ సభ్యులు అదనపు కలెక్టర్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. దూపల్లికి చెందిన ఓ వ్యక్తి భూమిని కబ్జా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

- స్క్రీన్–1 – రాయన్ (తెలుగు) – 11.40, కల్కి 2898 ఏడీ (తెలుగు) – 2.50, 6.35, 10.20
- స్క్రీన్–2 – డెడ్‌పూల్ 3డీ (తెలుగు)– 10.30, 1.30, 4.30, 7.30, 10.30
- స్క్రీన్–3 – రాయన్ (తెలుగు) – 01.00, 4.10, 7.20, 10.30
- స్క్రీన్–4 – శివం భజే (తెలుగు) – 11.00, 1.45 4.30, 7.35, 10.00

సంక్షిప్తం

నల్లూర్‌లో పారిశుధ్య పనుల పరిశీలన

బాల్కొండ: ముప్కాల్ మండలం నల్లూర్‌లో పారిశుధ్య పనులను ఎంపీవో మహ్మద్ గౌస్ పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జీపీలో రికార్డులను తనిఖీ చేశారు. కార్యదర్శి విఘ్నేష్ తదితరులున్నారు.

తహసీల్ కార్యాలయం తనిఖీ

మాక్లూర్: మండల కేంద్రంలోని తహసీల్ కా ర్యాలయాన్ని బుధవారం నిజామాబాద్ ఆర్డీవో రాజేందర్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి ధరణి సమస్యలు ఏమైనా ఉన్నాయా.. ఉంటే త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ మహ్మద్ షబ్బీర్‌కు సూచించారు. పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజల్ని ఇబ్బందులకు గురి చేయవద్దన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి బుధవారం మహిళా రైతులతో కలిసి పాలాభిషేకం నిర్వహించారు. నాయకులు ముస్కు మోహన్‌రెడ్డి, కొమ్ముల శ్రీనివాస్, ఏలేటి రాములు, ప్రశాంత్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి కూలీల బకాయిలు చెల్లించాలి

నందిపేట్(ఆర్మూర్): ఉపాధి హామీ కూలీలు, వన సేవకుల బకాయి డబ్బులు చెల్లించాలని కోరుతూ బుధవారం నందిపేట మండల కేంద్రంలో ప్రజాపంథా ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. నందిపేట ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించిన అనంతరం ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఏఐకేఎంఎస్, ప్రజాపంథా జిల్లా నాయకులు కే గంగాధర్, రాజలింగం, అనంతరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సూపర్‌బ్రెయిన్ యోగ

వర్ని: లయన్స్‌క్లబ్ ఆఫ్ నిజామాబాద్ సహారా ఆధ్వర్యంలో బుధవారం చందూర్‌లోని శ్రీసాయివిద్యాలయంలో సూపర్ బ్రెయిన్ యోగా కార్యక్రమం నిర్వహించారు. యోగా ట్రైనర్ అందె జీవన్‌రావు మెలకువలు నేర్పారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బొబ్బిలి నరసింహారావు, క్లబ్ కార్యదర్శి సి.ధనంజయరెడ్డి, శ్రీసాయి విద్యాలయం సెక్రటరీ, కరస్పాండెంట్ మధు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఆర్‌ఏ వర్తింపజేయాలని వినతి

మాక్లూర్: జిల్లా కేంద్రానికి అతి దగ్గరగా ఉన్న మాక్లూర్ మండలంలో పని చేసే ప్రతి ఉపాధ్యాయుడికి హెచ్‌ఆర్‌ఏ వర్తింపజేయాలని కోరుతూ పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు మెట్టు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బుధవారం జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. మండలంలో పని చేసే కొందరు ఉపాధ్యాయులకు హెచ్‌ఆర్‌ఏ వర్తించటం, మరి కొందరికి వర్తించకపోవటం వల్ల వారు తీవ్ర మనోవ్యధకు గురవుతున్నారన్నారు. వినతి పత్రం సమర్పించినవారిలో పీఆర్‌టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌గౌడ్, రచ్చ మురళి, చిలుక శ్రీనివాస్‌గౌడ్‌లు ఉన్నారు.

నేటి నుంచి తల్లి పాల వారోత్సవాలు

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ సీడీపీవో ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం నుంచి తల్లి పాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీడీపీవో జానకి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన చేశారు. 1 నుంచి 7 వరకు జరుగుతాయన్నారు.